క్లుప్తంగా

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



కాకర్లపల్లిలో ముత్యాలమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిరూరల్: మండలంలోని కాకర్లపల్లిలో ముత్యాలమ్మ ఆలయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి బుధవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చల్లారి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నారావు, ఎండీ కమల్‌పాషా, కంచర్ల రమేష్, పాదిలి మారేశ్వరరావు, ఉమా, అనిత పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన డిప్యూటీ సీఎం



విద్యార్థులను అభినందిస్తున్న భట్టి విక్రమార్క

మధిర: సీబీఎస్ఈ ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అభినందించారు. మధిరలోని సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ విద్యార్థి తేజ కార్తికేయ సీబీఎస్ఈ పదో తరగతిలో 500కు 495మార్కులతో జాతీయస్థాయిలో నాలుగో ర్యాంకు సాధించగా, గగన్ 454 మార్కులు వచ్చాయి. దీంతో విద్యార్థులకు డిప్యూటీ సీఎం బుధవారం శుభాకాంక్షలు తెలిపారు.

పరామర్శ



శ్రీనివాసరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సత్తుపల్లి: మండలంలోని బేతుపల్లికి చెందిన కొప్పుల శ్రీనివాసరావు వర్ధంతి సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆయన చిత్రపటానికి బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో తుమ్మల యుగంధర్, ఉడతనేని అప్పారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న నరసింహారావు

మధిర: ఈనెల 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు శీలం నరసింహారావు పేర్కొన్నారు. బుధవారం దెందుకూరు సమీపంలో ఉన్న గోడౌన్ల వద్ద హమాలీతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోరాటాలతో సాధించుకున్న 29కార్మిక చట్టాలను రద్దు చేయడం సరికాదని.. దీంతో కార్మిక సంఘాలు ఏర్పాటుతోపాటు ఉద్యోగ భద్రత, ఉపాధి కోల్పోతారన్నారు. సమ్మె విజయవంతానికై ఈ నెల 16న ఉదయం 9గంటలకు స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ నుంచి మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిచడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ కన్వీనర్ పడకంటి మురళి, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు బాంధవుడు శేషగిరిరావు



శేషగిరిరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నామా తదితరులు

తల్లాడ: మాజీ డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు 40ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో రైతుల కోసం పనిచేసి రైతు బాంధవుడిగా నిలిచిపోయారని మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మిట్టపల్లిలో రాయల శేషగిరిరావు కాంస్య విగ్రహం వద్ద ఆయన నివాళులర్పించడంతో పాటు రాయల గృహంలో కూడా ఆయన చిత్రటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, కార్యదర్శి డి.వెంకట్‌లాల్, నాయుడు శ్రీనువాసరావు, కేతినేని చలపతిరావు, బద్దం కోటిరెడ్డి, ముువ్వా మురళి, దీవెల వెంకటేశ్వరరావు, మోరంపూడి ప్రసాద్ పాల్గొన్నారు.

సుర్రుమంటున్న సూరీడు..





నిర్మానుష్యంగా మారిన వైరాలోని ప్రధాన రహదారి

- ఉష్ణోగ్రతలతో బెంబేలెత్తుతున్న జనం
- నిర్మానుష్యంగా మారుతున్న రహదారులు
- శీతల పానీయాలతో ఉపశమనం
- జాగ్రత్తలపై ఆరోగ్యశాఖ అవగాహన

సత్తుపల్లిటౌన్/వైరారూరల్: రోజురోజుకు ఎండ వేడి సెగ పెడుతోంది. సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనులు ప్రభావం.. భానుడి తీవ్రతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇంట్లో ఉక్కపోత.. రోడెక్కితే ఎండ వేడిమిని తట్టుకోలేక నానా అవస్థలు పడుతున్నారు. ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతుండటంతో అనేక మంది వడదెబ్బబారిన పడుతున్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య, ఆరోగ్య శాఖ కార్యాచరణ రూపొందించింది. పీహెచ్‌సీలు, ఆరోగ్య ఉపకేంద్రాలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు. సిబ్బంది పంపిణీ చేయటంలో నిమగ్నమయ్యారు.

మధ్యాహ్నం నిర్మానుష్యం..

భానుడి ప్రతాపంతో మధ్యాహ్న సమయంలో రోడెక్కాలంటేనే ప్రజలు జంకుతున్నారు. దీంతో పట్టణంలోని ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రోడ్డుపై నడవాలంటే ప్రజలు వేడిగాలులు దాటికి బెంబేలెత్తుతున్నారు. ఆఫీసులకు, దుకాణాలకు, ఇతర కార్యకలాపాలకు వెళ్లాలనుకుంటే తప్పని సరి పరిస్థితుల్లో బయటకు వస్తున్నా.. కొందరు మాత్రం వడదెబ్బకు ఆస్పత్రుల పాలౌతున్నారు. రోజురోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రత ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఎండ తీవ్రత, వేడిగాలుల నుంచి రక్షణ పొందేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ సూచిస్తోంది.

ఎండలో తిరగటం వల్ల ఇక్కట్లు..

ఈ వేసవికాలంలో ఉష్ణోగ్రతల ప్రభావం అధికంగా ఉన్నందున బయట తిరగటం వల్ల వడదెబ్బ, తల తిరగటం, అలసట, కండరాలు, పిక్కలు లాగటం, ఛర్మవ్యాధుల భారినపడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. తలతిరగటం, అలసట, కండరాల నొప్పుల వల్ల అనారోగ్యం కలిగినా ఎలాంటి హానీ కలగదు. కానీ వడదెబ్బ మాత్రం చాలా ప్రమాదకరం. ఒక దశలో ప్రాణాలు పోయే అవకాశం కూడా ఉంటుంది. ఎండలో ఎక్కువ సేపు తిరిగినప్పుడు సరైన నీటిని తీసుకోక పోతే అపస్మారక స్థితికి చేరుతారు. తీవ్ర జ్వరం, మూత్రం రాకపోవటం వంటి లక్షణాలు గమనిస్తే వడదెబ్బకు గురైనట్లు గర్తించాలి. కొందరిలో ఫిట్స్ లక్షణాలు కన్పిస్తాయి. బయట ఆహారం తీసుకోవటం ద్వారా డయేరియా సోకే అవకాశం ఉంటుంది. శరీరంలో నీటిశాతం తగ్గిపోవటం వల్ల కిడ్నీలపై ప్రభావం పడుతుంది. అధికవేడి వల్ల చమటకాయలు రావటం.. వేడిగడ్డలు కట్టడం, ఛర్మం కమిలిపోవటం వంటి సమస్యలు వస్తాయి. శరీరంపై దద్దుర్లు కూడా ఏర్పడతాయి.

వడదెబ్బకు గురైతే..

వడదెబ్బకు గురైతే నీరసంగా అనిపిస్తుంది. సత్తువ తగ్గటంతో పాటు తలనొప్పి, వాంతులు, విరోచనాలు, అధిక చమట వస్తుంది. మూత్రం పసుపు వర్ణంలో వస్తుంది. డీహైడ్రేషన్ వల్ల ఆందోళన కలిగిస్తుంది. ఎండలో తిరిగివచ్చి స్పృహ కోల్పొయి పడిపోయిన వ్యక్తులను వెంటనే నీడ ఉండే ప్రదేశానికి చేర్చాలి. చల్లటి గాలి తగిలేలా ఫ్యాన్ లేదా కూలర్ ముందు సేద తీరేలా చేయాలి. శరీరంపై తడి వస్త్రం కప్పాలి. ఐస్‌ప్యాక్‌లతో శరీరం అంతా తుడవాలి. తర్వాత దగ్గరలో ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్లాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, చిటికెడు గ్లూకోజ్ ద్రావణం తాగించాలి. ఐవీ ఫ్లూయిడ్స్ ఇవ్వటంతో పాటు ఓఆర్ఎస్ ద్రావణం తాగించాలి. దీంతో ప్రాణాపాయ స్థితి నుంచి గట్టెక్కే అవకాశం ఉంటుంది.

ఉపశమనం ఇలా..

ఎండలో తిరిగేవారు అలసటకు గురైనట్‌లెత్తై వెంటనే తాగునీరు ఎక్కువగా తీసుకోవాలి. కొబ్బరి బోండాలు, కాయకూరలు, పండ్లు తీసుకోవాలి. కూల్‌డ్రింక్స్‌కు దూరంగా ఉండటం మంచిది. రోడ్లపై విక్రయించే వేపుడు పదార్థాలను తీసుకోవద్దు.

జాగ్రత్తలే మేలు..

ఎండలో తిరగకుండా సాధ్యమైనంత వరకు నీడపట్టున ఉండటమే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండలో తిరగవద్దు. ఉదయం, సాయంత్రం వేళల్లోనే బయట పనులు చూసుకోవాలి. కాటన్, వదులుగా ఉండే దుస్తులు ధరించాలి. తప్పని సరిపరిస్థితుల్లో బయటకు వెళ్లితే టోపీలు, గొడుగులను వెంట తీసుకెళ్లాలి. శరీరానికి సన్‌స్క్రీన్ లోషన్‌లు వాడటం మంచిది. తరచుగా నీరు, లవణాలు తీసుకోవాలి. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు ఎండకాలం మరింత శ్రద్ధ తీసుకోవాలి.

తప్పనిసరైతేనే బయటకు..



ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తప్పనిసరి అయితేనే బయటకు వెళ్లాలి. ముఖ్యంగా వృద్ధులు, పిల లు, మహిళలు ఎండలో తిరగక పోవటం చాలా మంచిది. అస్వస్థతకు గురైతే సమీప ఆస్పత్రికి తరలించి వెంటనే చికిత్స అందించాలి.

– డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, సత్తుపల్లి

అవగాహన కల్పించాలి..



వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అవగాహన కల్పించాలి. ఏప్రిల్ ఆడపదడపా కురిసిన వర్షాలతో వాతావరణం చల్లగా ఉన్నప్పటికీ మే నెల లోమాత్రం ఉదయం 8గంటల నుండే భానుడు తన విశ్వరూపాన్ని చూపతున్నాడు.

– కాంద్ర శ్రీను, వైరా

రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారు



కల్యాణలక్ష్మి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్, నాయకులు

కారేపల్లి: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని పైలట్ విలేజ్ కొత్తతండా గ్రామంలో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్లపై అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని దోచుకొని రూ.8లక్షల కోట్లు అప్పుచేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. 25లక్షల మంది రైతులకు రూ.2లక్షల లోపు రూ.21వేల కోట్లు రుణమాఫీ చేసిందని, ఆపైన మాఫీపై సీఎం ఆలోచన చేస్తున్నారన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో రైతుకు అండగా ఉండేది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమేనన్నారు. వైరా నియోజకవర్గంలో 5వేల బోర్లు వేయించామని, సింగరేణి మండలంలో పైలట్ విలేజ్ కొత్తతండాతో కలిపి 400 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, పైలట్ ప్రాజెక్టు విలేజ్‌కు 13 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సురేందర్, డీటీ కృష్ణయ్య, ఏఓ బట్టు అశోక్, హౌసింగ్ డీఈ సాయిరాంరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నరసింహారావు, ఎంపీఓ రవీంద్రప్రసాద్, ధరావత్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత..

చింతకాని: మండలంలోని నేరడ గ్రామంలో లబ్ధిదారుడికి బుధవారం కాంగ్రెస్ నాయకులు సీఎం సహాయ నిధి చెక్కు అందించి మాట్లాడారు. అనారోగ్యంతో బాధపడుతున్న షేక్ హసీన్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క సిఫార్సుతో మంజూరైన రూ.65 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగేశ్వరరావు, తిరుపతిరావు, వెంకయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

● శ్వేతపత్రం విడుదల చేయాలి

సత్తుపల్లి: సత్తుపల్లి సింగరేణి నిధులు పక్కదారి పడుతున్నాయని నిధుల వినియోగంపై సింగరేణి అధికారులు శ్వేతపత్రం విడుదల చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పడిగల మధుసూదన్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ గిడ్డంగుల నిర్మాణం కోసం గ్రామ పంచాయతీలకు సింగరేణి నిధులు కేటాయించినా గాని ఆ నిధులు అధిక పార్టీ నాయకుల ఒత్తిళ్లతో మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్‌నగర్‌లో చేపట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆచంట నాగస్వామి, నియోజకవర్గ కన్వీనర్ వీరంరాజు, జొన్నలగడ్డ నరేష్, శివ యాదవ్, సుబ్రమణ్యం, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

● గ్రామ కమిటీల ఎన్నిక..

తల్లాడ: టీడీపీ సత్తుపల్లి నియోజకవర్గ పర్యవేక్షకుడు కేతినేని హరీష్ ఆధ్వర్యంలో టీడీపీ గ్రామ కమిటీల ఎన్నికలు నిర్వహిస్తున్నారు. తల్లాడ మండలం గోపాలపేట గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా రాయల సీతారామారావు, అన్నారుగూడెం గ్రామ అధ్యక్షుడిగా గొడ్ల వెంకటరత్నం లను బుధవారం ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో తల్లాడ మండల నాయుకులు కూచిపూడి వెంకటేశ్వర్‌రావు, దూపాటి భద్రరాజు, శ్రీనివాసరాజు, దుగ్గిన్ని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● తోటలో జంతు కళేబరాలు

పెనుబల్లి: మండలంలోని టేకులపల్లిలో ఓ మామిడి తోట నుంచి దుర్వాసన వస్తుండగా, పరిశీలన అనంతరం జంతువుల కళేబరాలు ఉన్నాయని గుర్తించారు. గ్రామానికి చెందిన కోటా ప్రభాకర్ తండ్రి సామేలు పేరిట ఉన్న మామిడి తోటలో జంతువుల కళేబరాలను గుర్తించి గ్రామ కార్యదర్శి శోభారాణి వీఎం బంజర్ పోలీసులకు ఫిరయాదు చేశారు. దీంతో ప్రభాకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు.

● గేదెల యజమానులకు పరిహారం

పెనుబల్లి: మండలంలోని సీతారామపురానికి చెందిన శదరాసుపల్లి అంకమరావుకు చెందిన రెండు గేదెలు గత రెండు సంవత్సరాల క్రితం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాయి. విషయాన్ని ఎమ్మెల్యే రాగమయి దృష్టికి తీసుకెళ్లగా.. ఆమె సహకారంతో పెనుబల్లి విద్యుత్ శాఖ ద్వారా రూ.40 వేలు మంజూరు అయ్యాయి. బుధవారం ఆ చెక్కును కాంగ్రెస్ నాయకులు రైతు అంకమరావుకు అందించారు. కాంతయ్య, కిరణ్‌కుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

వైరాలో 'మే' ఫ్లవర్



వైరా: వైరాలోని పాత ఎక్సైజ్ కార్యాలయం వీధిలో సుధ ఇంట్లో ప్రతి ఏడాది మే నెలలో పూసే మే ఫ్లవర్ బుధవారం పూసింది. ఎరుపు రంగులో ఉండి సన్నటి పుప్పొడి రూపంలో కొమ్మలు లేకుండా ఉన్న ఈ మొక్క చూపరులను ఆకట్టుకుంటుంది. దీనిని 'సాక్షి' క్లిక్ మనిపించింది.

ఆడపిల్ల పుట్టడం అదృష్టం



సత్తుపల్లిటౌన్: ఆడపిల్ల తల్లిదండ్రులను సన్మానిస్తున్న ప్రత్యేక అధికారి సునీల్‌రెడ్డి



చింతకాని: నర్సింహాపురంలో.. సన్మానపత్రం అందిస్తున్న ఐసీడీఎస్ ఏసీడీపీఓ శివకుమారి

సత్తుపల్లిటౌన్/తల్లాడ: ఆడిపిల్ల పుట్టడం అదృష్టమని మండల ప్రత్యేకాధికారులు సునీల్‌రెడ్డి, శివకుమార్ తెలిపారు. బుధవారం సత్తుపల్లి, తల్లాడలోని మల్సూర్‌తండాలో నిర్వహించిన «మా పాప – మా ఇంటి మణిదీపం» కార్యక్రమంలో ఆడిపిల్లలకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను సత్కరించి సర్టిఫికెట్ అందించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ, ఎంపీడీఓ సురేష్‌బాబు, ఏసీడీపీ నవ్యశ్రీ , ఇన్‌చార్జ్ సీడీపీఓ గంగాజలం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రత్నకుమారి, రోజా, సత్యావతి, ఆశాలు పాల్గొన్నారు.

చింతకాని/బోనకల్: మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో భాగంగా చింతకాని మండలంలోని నర్సింహాపురంలో ఆడపిల్లకు జన్మనిచ్చిన దొడ్డ పవన్‌కుమార్, సమత దంపతులను ఐసీడీఎస్ ఏసీడీపీఓ శివకుమారి బుధవారం సన్మానించారు. అదే విధంగా బోనకల్‌లోని ఆళ్లపాడులో తెల్లబోయిన పరుశురాం, ఉమ దంపతులకు పాప పుట్టడంతో తహసీల్దార్ పున్నం చందర్ వారి ఇంటికి వెళ్లి సన్మానించి సర్టిఫికెట్‌తో పాటు మిఠాయిలు పంచిపెట్టారు. ఆడపిల్ల ప్రాముఖ్యతను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి పర్వీన్ ఖైసర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మీ, పద్మావతి, రమాదేవి, సుజాత, ఏపీఓ కృష్ణకుమారి, వైద్యాధికారులు రేఛల్‌రాణి, ప్రవంతి, ఏఎన్ఎం రజిని, గ్రామ పంచాయతీ కార్యదర్శి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఏన్కూరు: మండల పరిధిలోని రాంనగర్ తండాలో బుధవారం మా ఇంటి మణిదీపం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడపిల్ల తల్లిదండ్రులకు మండల ప్రత్యేకాధికారి సాయినాథ్ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ బక్కమ్మ, అంగన్‌వాటి టీచర్లు సుగుణ, ఎం.పద్మ, వి.పద్మ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి



ముష్టికుంట్లలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ చందర్

బోనకల్: రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పున్నం చందర్, డిప్యూటీ తహసీల్దార్ రాంబాబు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ముష్టికుంట్ల, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో నిర్వహించిన రెవె న్యూ సదస్సుల్లో 238 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ.. భూ సమస్యల శాశ్వత పరిష్కారానికై ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. కార్యక్రమంలో గిర్దావర్ మైథిలీ, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్తుపల్లి: సత్తుపల్లి పట్టణంలో గురువారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు సత్తుపల్లి ఐపీడీఎస్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ శరత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని కల్పతరురోడ్‌లో సమ్మర్ యాక్షన్‌లో భాగంగా 160కేవీఏ డీటీఆర్ పెట్టుట కారణంగా కల్పతరురోడ్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలకు ఏర్పాట్లు

మధిర: మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు త్వరలో నిర్వహించనుండగా, పూర్వ విద్యార్థుల ఆధ్వర్యాన బుధవారం సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అద్దంకి విప్లవకుమార్, కళ్యాణం వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ ఉత్సవాల విజయవంతానికి కమిటీలు నియమించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జయాకర్, వాసు, రమణగుప్త, రవిబాబు, వెంకటేశ్వరరావు, కళ్యాణి, రమేష్, ప్రసాదరావు పాల్గొన్నారు.

పాఠశాలకు చైర్ వితరణ



చైర్‌ను అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ఏన్కూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది చదివిన 2004 బ్యాచ్ విద్యార్థులు ఆ పాఠశాలకు రొటేటింగ్ చైర్‌ను హెచ్ఎం కె. సైదయ్యకు బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు షేక్ ఇబ్రహీం, బి.హరికృష్ణ, పి.నరేష్, ఎల్.ప్రసాద్, ఎల్.సీతారామం పాల్గొన్నారు.

నేడు వైఎన్ పురంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

కల్లూరురూరల్: మండలంలోని యజ్ఞనారాయణ పురం గ్రామంలో గురువారం మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావు విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు బుధవారం తెలిపారు. ఎన్టీఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణ చేతుల మీదుగా విగ్రహావిష్కరణ ఉంటుందని.. అభిమానులు, టీడీపీ నాయకులు, సానుభూతిపరులు అధిక సంఖ్యలో హాజరై సభను జయప్రదం చేయాలన్నారు.


ఖజానాశాఖ డీడీకి సత్కారం



ఖజానా డీడీ ప్రసన్నకుమార్‌ను సత్కరిస్తున్న రిటైర్డు ఉద్యోగులు

వైరా: ఖమ్మం ఖజానా డిప్యూటీ డైరెక్టర్‌గా ఇన్‌చార్జ్ బాధ్యతలు స్వీకరించిన వైరా టీఎస్ జేఎల్ ప్రసన్న కుమార్‌ను బుధవారం వైరా ఖజానా శాఖ సిబ్బంది తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంఘం తరుపున శాలువా పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డు ఉద్యోగుల సంఘం నాయకులు ఎస్.పెంటయ్య, చల్లా.కృష్ణారావు, సామినేని వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు సుధాకర్, భాస్కరరావు, మల్లయ్య, దుర్గా ప్రసాద్, ప్రవీణ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు రూ.600 వేతనం ఇవ్వాలి



మాట్లాడుతున్న ఉమర్

సత్తుపల్లిరూరల్: ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు ఎస్‌కె. ఉమర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని బుగ్గపాడులో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం పామర్తి లక్ష్మయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూలీలకు పని ప్రదేశాల్లో కనీస వసతులు కల్పించి, రూ.600 వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకుడు కె.సత్యనారాయణ, ఉపాధి కార్మికులు సత్యవతి, చంద్రమ్మ, లక్ష్మి, రమాదేవి, రమణ తదితరులు పాల్గొన్నారు.

అలంకారప్రాయమేనా..?

నిరుపయోగంగా వైకుంఠధామాలు

- రెండింటికి సెంటిమెంట్
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



నిరుపయోగంగా ఉన్న గంధసిరిలోని వైకుంఠధామం

ముదిగొండ: తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పథకంలో ఈవైకుంఠధామం ఒకటి. ఈ పథకం ద్వారా పల్లెల్లో ఇబ్బందులు లేకుండా ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా ముదిగొండ మండలంలో 25 పంచాయతీల్లో ఒక్కొక్క గ్రామపంచాయతీకి రూ. 12.50లక్షలతో ఖర్చు చేసి నిర్మాణాలు చేపట్టారు. నిర్మాణాలు పూర్తి చేసి సంవత్సరాలు గడుస్తున్నా, వినియోగంలోకి రావడం లేదు.

ఎక్కడెక్కడ ఉన్నాయంటే..

గంధసిరిలో మున్నేరు ప్రాంతాన నిర్మించిన వైకుంఠధామం నిరుపయోగమే.. అప్పటినుంచి ఇప్పటి వరకు వినియోగంలోకి రావడం లేదు. గోకినేపల్లిలో, ఖానాపురంలో నిర్మించిన దానికి విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. పెద్దమండవలో నిర్మించి నిరుపయోగంగా తాళాలు వేసి ఉంది. ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించి నిర్మాణాలు చేపట్టిన చోట్ల ప్రజల అవగాహన లేక ఉపయోగించడం లేదని కొంత మంది వాదన. గతంలో శ్మశానవాటికకు వెళ్లాలంటే స్థలాల దగ్గర, ఘర్షణలు చోటు చేసుకునేవి. మరికొంతమంది తమ పొలాల్లోకి వెళ్లేవారు.

సెంటిమెంట్‌గా రెండు గ్రామాలు..

గంధసిరి, పెద్దమండవ గ్రామాల్లో కొంతమంది వైకుంఠధామాలను దాటేసి మున్నేరులోనే అన్ని కార్యక్రమాలు చేస్తున్నారు. అక్కడవారిని అడిగేవారు లేక ప్రజాధనమంతా వృథాపాలు అవుతుంది. మొదట్లో అత్యంక్రియలు చేసేందుకు వెళ్లిన తరువాత వరుస క్రమంలో మృత్యువాత పడుతున్నారనే ఆరోపణలు రావడంతో అక్కడి ప్రజలు సెంటిమెంట్‌గా ఆ రెండింటిని వదిలేశారు. అధికారులు అవగాహన కల్పించి, నిరుపయోగంగా ఉన్న వాటిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

నిర్మించి నిరుపయోగం..



గత నాలుగేళ్ల క్రితం వైకుంఠధామం నిర్మాణం చేపట్టినప్పటికీ, వినియోగంలోకి రావడంలేదు. అన్ని ఏర్పాట్లు చేసి సమకూర్చారు, ఇంకా ప్రారంభం కాలేదు. గ్రామంలో ఇది అందరికీ తెలిసిందే, తాళం వేసి ఉండడంతో పాటు, కొంతమంది బయట, మరి కొతమంది మున్నేరులో కార్యక్రమాలు చేస్తున్నారు.

– కందిమళ్ల తిరుపతి, పెద్దమండవ

అవగాహన కల్పిస్తాం..



25గ్రామపంచాయతీల్లో వైకుంఠధామాల నిర్మాణాలు చేపట్టాం. చాలా చోట్ల వినియోగిస్తున్నారు. కొన్ని చోట్ల ప్రారంభం కాకపోయిన వినియోగించుకోవచ్చని ఆరెండు గ్రామాల్లో తెలియజేస్తాం. గ్రామాల్లోని ప్రజలు ముందుకు వచ్చి వైకుంఠధామాలను వినియోగించుకోవాలి. అధికారులు, ప్రజాప్రతినిధుల ద్వారా అవగాహన కల్పిస్తాం.

– ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, ముదిగొండ